క్లుప్తంగా

బైకు ఢీకొని వ్యక్తి మృతి

ఊర్కొండ: రోడ్డుపక్కన నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని బైకు ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చిన్న వెంకటయ్య(54) శుక్రవారం మండల కేంద్రంలో తన సొంత పనులు ముగించుకొని కల్వకుర్తి– జడ్చర్ల రోడ్డు మార్గాన కాలినడకన స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో వేగంగా వచ్చిన ద్విచక్రవాహనదారుడు చిన్న వెంకటయ్యను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. దీంతో మృతదేహాన్ని తిరిగి కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. వెంకటయ్య గతంలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేసేవాడని గ్రామస్తులు పేర్కొన్నారు.

గడ్డివాము దగ్ధం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండం గ్రామానికి చెందిన గుజ్జ రాముడుకు చెందిన వేరుశనగ పొల్లు, మరియు గడ్డివాము వ్యవసాయ పొలంలో 11కేవీ తీగలు కలుసుకొని మంటలు రావడంతో దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. రూ.80వేల వరకు నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం: ఆర్థిక ఇబ్బందుల వల్ల వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ వివరాల ప్రకారం.. మండలంలోని ఔరాసిపల్లి గ్రామానికి చెందిన రాముడు (38) కూలీపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. చాలా రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడేవాడు. మనస్థాపానికి గురై వ్యవసాయపొలంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని చేరకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. అతని భార్య యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దారిదోపిడీకి యత్నం

కొల్లాపూర్: కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లి సమీపంలోని కేఎల్‌ఐ కాల్వ వద్ద ప్రధాన రహదారిపై గురువారం రాత్రి కొందరు గుర్తు తెలియని దుండగులు దారి దోపిడీకి ప్రయత్నించారు. పెంట్లవెల్లి మండల కేంద్రానికి చెందిన నలుగురు బంగారు వ్యాపారులు కారులో హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గురువారం రాత్రి 10:30 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి బంగారు వ్యాపారులు వస్తున్న కారును కేఎల్‌ఐ కాల్వ వద్ద ప్రధాన రహదారిపై ఓ వ్యక్తి చేయి ఊపుతూ ఆపమని సైగ చేశాడు. వ్యాపారులు కారును ఆపేందుకు స్లో చేశారు. కారు ఆపిన వ్యక్తి వెనక మరో ఐదుగురు వ్యక్తులు ముఖాలకు మాస్కులు వేసుకొని ఉండడాన్ని గమనించి వ్యాపారులు కారును ఆపకుండా ముందుకు కదిలారు. దీంతో దుండగులు ఇనుప రాడ్‌తో కారు అద్దాలు ధ్వంసం చేశారు. ఈ క్రమంలో ఓ దుండగుడిని కారు ఢీకొట్టింది. అతనికి రక్త గాయాలయ్యాయి. దుండగుల దాడి నుంచి తప్పించుకున్న బంగారు వ్యాపారులు నేరుగా కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయం పోలీసులకు చెప్పారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని గాలించగా దుండగులు ఎవ్వరూ కనిపించలేదు. శుక్రవారం ఉదయం సీఐ.మహేష్, కొల్లాపూర్, పెంట్లవెల్లి ఎస్‌ఐలు హృషికేష్, రామన్‌గౌడ్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రోడ్డుపై దుండగుల రక్తపు మరకలు గుర్తించారు. డాగ్ స్క్వాడ్‌తో సమీప ప్రాంతాలు వెతికారు. ఈఘటనపై రమేష్ అనే బంగారు వ్యాపారి ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసుకొని విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ హృషికేష్ వెల్లడించారు. దుండగులు స్థానికులా లేక ఇతర ప్రాంతాల నుంచి పనుల కోసం ఇక్కడికి వచ్చిన వారా అనేది తెలియాల్సి ఉంది.

పాఠశాలకు వాటర్‌ప్లాంట్ వితరణ

కందనూలు: గగ్గలపల్లిలో జెడ్పీహెచ్‌ఎస్‌కు లింక్‌వెల్ టెలిసిస్టం ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం వాటర్ ప్లాంట్‌ను బహూకరించినట్లు హెచ్‌ఎం నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా లింక్‌వెల్ టెలిసిస్టం జనరల్ మేనేజర్ మోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు స్వచ్ఛమైన మంచినీరు అందించాలనే ఉద్దేశంతో వాటర్‌ప్లాంట్ బహూకరించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు స్వరూపరాణి, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, దేవరాజు పాల్గొన్నారు.

కూలీలందరికీ ఉపాధి కల్పిస్తాం

వెల్దండ: వేసవిలో కూలీలందరికి జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తామని ఏపీఓ ఈశ్వర్‌జీ పేర్కొన్నారు. శుక్రవారం చెర్కూర్‌లో ఉపాధి హామీ పథకంలో భూమి చదును చేసే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలతల ప్రకారమే పనులు చేస్తేనే గిట్టుబాటు కూలీ లభిస్తుందన్నారు. రైతులు, కూలీలందరు ఉపాధి హామీ పథకం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఏ లింగస్వామి, ఫీల్డ్‌అసిస్టెంట్ కృష్ణయ్య, మేట్లు తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



చెర్కూర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- 100పడకల ఆస్పత్రికి రూ.45 కోట్లు
- వేరుశనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం

కల్వకుర్తి/కల్వకుర్తిరూరల్/వెల్దండ: పట్టణంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వం రూ.45 కోట్ల 56 లక్షల నిధులు మంజూరు చేస్తూ జీఓ 366 విడుదల చేసిందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని పంజుగూల, రఘుపతిపేట, సుద్దకల్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మండలంలోని రఘుపతిపేటలో ఇందిరమ్మ ఇళ్లు, వి ద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి చేశారు. సుద్దకల్‌లో పార్టీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగేలా చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. 4 ఎకరాలలో వందపడకల ఆస్పత్రి నిర్మాణంతోపాటు 127 మంది సిబ్బంది నియామకానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రిని మాతా శిశు సంరక్షణ కేంద్రంగా ఉంచేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు.

అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు

ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన వారందరికి అందిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి పేర్కొన్నారు. వెల్దండ మండలంలోని చెర్కూర్‌లో ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశా రు. కల్వకుర్తి నియోజకవర్గానికి ప్రభుత్వం 3500 ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మండలంలో చెర్కూర్ గ్రామం ఎంపిక చేయడంతో మొదటి విడతలో 24మంది లబ్ధిదారులను ఎంపిక ముందుగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

వేరుశనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం

రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైన ఉందని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని మార్కెట్‌యార్డ్‌లో పీఏసీఎస్ ఎన్‌సీసీఎఫ్ మార్క్‌ఫెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేరుశనగల పంట కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. నిబంధనల ప్రకారం పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చే రైతులకు క్వింటాల్‌కు రూ. 6783ల ధర చెల్లిస్తారని చెప్పారు. ఎన్‌సీసీఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ రవిచంద్రం మాట్లాడారు. కార్యక్ర మంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబర్ బాలాజీసింగ్, పీఏసీఎఫ్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ మనీలాసంజీవ్, తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ



ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే డా.రాజేష్ రెడ్డి

బిజినేపలి/తిమ్మాజిపేట: పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన అల్లీపూర్ గ్రామంలో మొదటి ఇందిరమ్మ ఇంటికి ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. కాంగ్రెస్ మండల నాయకుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో అల్లీపూర్‌లో పాదయాత్రగా వెళ్లి సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు రమణారావు, అమృతరెడ్డి, మిద్దెరాములు, నసీర్, వాల్యానాయక్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- తిమ్మాజిపేట మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. గ్రామానికి 30 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, భార్గవి, రంగయ్యల ఇంటి నిర్మాణానికి ఎమ్మెల్యే పూజ చేసి పనుల ప్రారంభించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీదేవి, రమణరావు, ఏఈ రాజవర్ధన్‌రెడ్డి, నాయకులు వెంకట్రామ్‌రెడ్డి, మల్లయ్యగౌడ్, రవీందర్‌రెడ్డి, మాదవులు, లక్ష్మీనా రాయణ, నాగసాయిలు, బెన్నీ, రాజు పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల ఆకస్మిక తనిఖీ

వెల్దండ: మండలంలోని గుండాల గ్రామం ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలను శుక్రవారం కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ డైరెక్టర్ శివానందబచిగుండి, ఏకలవ్య గురుకులాల అకాడమిక్ ఓఎస్‌డీ రామారావు, స్పోర్ట్స్ ఆఫీసర్ వీర్యానాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వీరికి పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయ సిబ్బంది పూలబొకేతో స్వాగతం పలికారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పర్దీప్‌కుమార్, ఉపాధ్యాయులు భాస్కర్, సుమన్, రీనా తదితరులు ఉన్నారు.

ఏకలవ్య పాఠశాలలో ప్రవేశ పరీక్ష

వెల్దండ మండలంలోని గుండాల గ్రామం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ 6వ తరగతిలో చేరేందుకు ఈ నెల 16న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ పర్దీప్‌కుమార్ తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పరీక్షలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. శుక్రవారం నుంచి తెలంగాణ ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడు చేసుకోవాలన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని సూచించారు.

విద్యలో మహిళల పాత్ర కీలకం

బిజినేపల్లి: ప్రభుత్వ రంగ సంస్థలలో ఎక్కువగా పనిచేస్తున్నది విద్యారంగంలోనేనని విద్యలో మహిళల పాత్ర కీలకం అని జిల్లా లీగల్ సెల్ సర్వీస్ అ థారిటీ సెక్రటరీ సబిత అన్నారు. బిజినేపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మహిళా సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. నేటి బాలలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దేది మహిళలేనన్నారు. మహిళలు అన్నిరంగాల్లో పోటీపడి రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రి న్సిపల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ సుగుణ, ఎంఈఓ రఘునందన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై కళాజాత

బిజినేపల్లి: ఎయిడ్స్ నియంత్రణపై శుక్రవారం మండలంలోని మంగనూర్ గ్రామానికి చెందిన బస్టాండు ఆవరణలో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో కళాకారులు పాట లు పాడుతూ పల్లె సుద్దుల ద్వారా హెచ్ఐవీ నాలుగు రకాలుగా సోకుతుందని, దాని నిర్మూలన కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాజాత కళాకారులు శ్రీనివాస్, నర్సింహ, చెన్నయ్య, వెంకటేష్, వెంకటస్వామి, వైద్య సిబ్బంది జ్యోతి, పద్మ, అనిత, నాగమ్మ, శారద, హేమలత, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన



కోడేరు: మండల కేంద్రంలోని గ్లోబల్ అక్షరాభ్యాస పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కలెక్టర్‌గా సాయిప్రియ, డీఈఓగా రీతి, డిప్యూటీ డీఈఓగా సాయివరుణ్, ఎంఈఓగా నవదీప్‌తో పాటు మరికొంత మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శ్రీనివాసులు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 6,436 మంది హాజరు



కందనూలు: జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా కొనసాగాయి. మూడోరోజు జిల్లావ్యాప్తంగా 33 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా.. 6,803 మంది విద్యార్థులకు గాను 6,436 మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 5,156 మందికి గాను 4,907 మంది, ఒకేషనల్ విభాగంలో 1,647 మందికి గాను 1,529 మంది హాజరై పరీక్షలు రాశారు. జనరల్‌లో 244 మంది, ఒకేషనల్‌లో 118 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఐఈఓ వెంకటరమణ తెలిపారు.

వైభవంగా నాకబలి



వెల్దండ: మండలంలోని గుండాల శ్రీ అంబా రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున నాకబలి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదమంత్రోచ్ఛరణాల మధ్య ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సందీప్‌రెడ్డి, వైస్ చైర్మన్ అరుణ్‌కుమార్, ఈఓ ప్రసాద్, కమిటీ సభ్యులుపాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా సర్వే చేయాలి



నాగర్‌కర్నూల్: ఫౌండేషన్ లిటరసీ న్యూమరసి విధానంలో చేపట్టే విద్యార్థుల కనీస సామర్థ్యాల సర్వేను నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా అడాకమిక్ మానిటరింగ్ ఆఫీసర్ షర్ఫొద్దీన్ అన్నారు. సర్వేపై శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్వే చేసే ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రగతిని సమీక్షిస్తూ లోపాలను సరి చేసే ఉద్దేశంతో క్షేత్రస్థాయిలో కనీస సామర్థ్యాల సాధన గురించి రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈనెల 10, 11, 12న సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అమలవుతున్న ఫౌండేషన్ లిటరసీ న్యూమరసి స్థితిగతులను ట్యాంజరిన్ అప్లికేషన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎంపిక చేయబడిన పాఠశాలల ఉపాధ్యాయులు ఈ సర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రీసోర్స్ పర్సన్‌లు లక్ష్మీ నర్సింహారావు, భృంగి కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో డీఈఓ తనిఖీ

దోమలపెంట: దోమలపెంటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఈగలపెంటలోని ప్రైవేట్ డీఏవీ ఉన్నత పాఠశాలలను శుక్రవారం జిల్లా విద్యాధికారి ఎ.రమేష్‌కుమార్, అమ్రాబాద్ ఎంఈఓ బాలకిషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఈఓ పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పాఠాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించారు. తెలుగుపల్లిలో ప్రాథమిక పాఠశాలను, పదరలో కేజీబీవీని డీఈఓ సందర్శించారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

అచ్చంపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎస్టీయూ ఆధ్వర్యంలో శనివారం అచ్చంపేట బాలుర ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు సన్మానం ఉంటుందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మురళి, కొత్త శ్రీధర్‌రావులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశానికి వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా రాష్ట్ర బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అచ్చంపేట: అచ్చంపేట 132/33 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల వల్ల శనివారం సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు ఏఈ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

బస్‌స్టాప్ ఏర్పాటుకు వినతి

వెల్దండ: మండలంలోని రాఘయపల్లి వద్ద హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం మహబూబ్‌నగర్ రిజనల్ మేనేజర్ సంతోష్‌కుమార్‌కు దిశ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్ వినతిపత్రం అందజేశారు. రాఘయపల్లి బస్‌స్టేజీ వద్ద రిక్వెస్ట్ బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు.

రోడ్డెక్కిన విద్యార్థులు



అచ్చంపేట రూరల్: పట్టణంలోని సాయినగర్ కాలనీ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు శుక్రవారం రోడ్డెక్కారు. పాఠశాల నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు వచ్చి చౌరస్తాలో రాస్తారోకో చేశారు. ప్లకార్డులతో హెచ్‌ఎం కావాలంటూ నినాదాలు చేస్తూ భీష్మించుకుని కూర్చున్నారు. పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థులకు నచ్చజెప్పి అక్కడి నుండి పంపించారు. పాఠశాలలో హెచ్‌ఎం, ఉపాధ్యాయురాళ్ల మధ్య అంతర్గత వివాదాలు చోటు చేసుకున్నాయి. ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడంతో జిల్లా విద్యాశాఖ అధికారులు హెచ్‌ఎంను, ఉపాధ్యాయురాలిని వేరువేరు పాఠశాలలకు బదిలీ చేశారు. శుక్రవారం విద్యార్థులు మా హెచ్‌ఎం మాకు కావాలంటూ నిరసన కార్యక్రమం చేపట్టారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



అమ్రాబాద్: పదో తరగతిలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్, పదర కేజీబీవీ, తెలుగుపల్లి పాఠశాలలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ బాలకిషన్, హెచ్‌ఎం లాల్‌సింగ్ ఉన్నారు.

‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట: పదో తరగతి విద్యార్థుల పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులతో పాఠశాల విద్యాభివృద్ధిపై విస్తృతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, ప్రధానోపాధ్యాయలు విష్ణుమూర్తి, బాలకిషన్ పాల్గొన్నారు.

చికెన్, ఎగ్ మేళా

అచ్చంపేటలో రామ్‌రెడ్డి చికెన్ మార్కెట్ నిర్వహించిన చికెన్, ఎగ్ మేళాలో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చికెన్, ఎగ్‌లు ప్రజలు నిర్భయంగా తినవచ్చని చెప్పారు.

సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత

లింగాల: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మండలంలోని అవుసలికుంటలో రాత్రి ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలు విడుదల

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లి శ్రీ లక్ష్మీనరసింహ్మస్వామి ఆలయంలో ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ విడుదల చేశారు. పురాతన మామిళ్లపల్లి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో అందరూ పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

జన ఔషధి మందులతో పేదలకు మేలు



జన ఔషధి దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

నాగర్‌కర్నూల్ క్రైం: జన ఔషధి మందులు బ్రాండెడ్ కంపెనీ మందులతో సమానంగా పనిచేస్తాయని జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రఘు అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో కేంద్ర ప్రభుత్వం పథకం ద్వారా ప్రత్యేకంగా నిర్వహిస్తున్న జన ఔషధి దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు చవకగా అన్నిరకాల వ్యాధుల చికిత్సలకు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజా ఉపయోగార్థం ప్రధానమంత్రి జన ఔషధి దుకాణాలు ఏర్పాటు చేశారని, ఒక మెడిసిన్ ప్రధానమంత్రి జన ఔషధి దుకాణంలో మందులు ఒకే ధరకు లభిస్తే, ఇదే మెడిసిన్ బ్రాండెడ్ కంపెనీ వారు ఇతర మెడికల్ షాపులలో పలు రెట్ల హెచ్చింపు ధరతో లభిస్తుందన్నారు. వైద్యులు సూచించిన మందులను జన ఔషధ దుకాణాల్లో కొనుగోలు చేసి 30 నుంచి 80 శాతం ఆర్థికంగా పొదుపు చేసుకోవాలని సూచించారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి జన ఔషధి దుకాణాల్లో లభించే మందులు తక్కువ ధరలు ఉండడం వల్ల సరిగా పనిచేయవనే అపోహతో ఉన్నారని, బ్రాండెడ్ కంపెనీ తయారు చేసే మందులతో సమానంగా పనిచేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ రవిశంకర్, డాక్టర్ ప్రశాంత్, పీపీ యూనిట్ వైద్యులు సంతోష్, అభిరామ్, హెల్త్ అసిస్టెంట్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి

నాగర్‌కర్నూల్ క్రైం: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా. వెంకటదాసు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు క్షయ వ్యాధి గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ టీబీ ముక్త్ భారత్ వందరోజుల ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమంలో ప్రజలను, కార్మికులను, ఇతర ఉద్యోగ సిబ్బందిని ప్రత్యేకంగా టీబీ పరీక్షలు నిర్వహించి, క్షయ రహిత సమాజం ఏర్పడేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషన్ నరేష్‌బాబు, క్షయవ్యాధి ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజశేఖర్, క్షయ ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ బ్లేస్సి, వైద్యాధికారి డాక్టర్ సంతోష్ అభిరామ్, క్లస్టర్ ఆరోగ్య సిబ్బంది ఆర్ శ్రీనివాసులు, నరసింహ, పీపీ యూనిట్ పర్యవేక్షకులు మరియమ్మ, నర్సింగమ్మ, టీబీ సూపర్‌వైజర్ ఎండీ ఆరీఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించాలి

తడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు, గ్రామాల ప్రత్యేక అధికారులు దృష్టి సారించాలని ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం మండలంలోని మేడిపూర్‌ను సందర్శించి పగిలిన పైప్‌ను తీయించి, కొత్త పైప్‌ను వేయించారు. గ్రామంలో ప్రధాన రోడ్డుకు అనుసరించి ఉన్న పైప్ పగిలిపోయి నీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ విషయం తెలుకున్న ఎంపీడీఓ పంచాయతీ కార్యదర్శితో పాటు ప్రత్యేక అధికారిని అప్రమత్తం చేసి కొత్తపైప్‌ను వేయించారు. 8న మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో గ్రామసభ నిర్వహించాలని తెలిపారు.

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి



కల్వకుర్తి రూరల్/పెద్దకొత్తపల్లి: పంచాయతీలలో పనిచేసే కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, జీఓ నెంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ విధానం రద్దుచేసి కార్మికులకు రిటర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షల పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం కల్వకుర్తి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శంకర్, మహేష్, అర్జున్, మైసమ్మ, మంజుల పాల్గొన్నారు.

- పెద్దకొత్తపల్లి గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు గ్రీన్ చానల్ ద్వారా చెల్లించాలని కోరుతూ ఎంపీడీఓ నాగేందర్‌కు పంచాయతీ కార్మికులు వినతిపత్రం అందజేశారు.

ఆశా వర్కర్లకు భద్రత కల్పించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్/కల్వకుర్తి రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఆశా వర్కర్లకు రక్షణ కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నాగర్‌కర్నూల్ అంబేడ్కర్ చౌరస్తాలో దళిత మహిళా ఆశా వర్కర్‌పై లైంగిక దాడికి నిరసన తెలిపారు. కల్వకుర్తిలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆశా వర్కర్లు నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వర్ధం పర్వతాలు, రఫీక సుల్తానా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్/కొల్లాపూర్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీఓ కార్యాలయం ముందు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా ని ర్వహించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడారు. అనంతరం ఎంపీడీఓ కోటేశ్వర్ వినతి పత్రం అందజేశారు.

- గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్ డిమాండ్ చేశారు. కొల్లాపూర్ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ముందు పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ ఏఓ భరత్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో జీపీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి మల్లేష్, ఉపాధ్యక్షులు కురుమయ్య, మండల అధ్యక్షులు బాలస్వామి, పరమేష్, అశోక్, బాలు ఉన్నారు.

మహిళా హక్కుల కోసం ఉద్యమిద్దాం



నాగర్‌ర్నూల్‌రూరల్: మహిళా శ్రామిక హక్కుల కోసం ప్రతి మహిళా ఉద్యమించాలని జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన అతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా, పనిగంటల తగ్గింపు కోసం, వేతనాల పెంపు కోసం, ఓటు హక్కు కోసం మహిళలు నిర్వహించి సుదీర్ఘ పోరాటాల వల్ల మహిళా దినోత్సవం ఏర్పడిందన్నారు. ఈ దినోత్సవానికి 115 సంవత్సరాల చరిత్ర ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్య దర్శి కందికొండ గీత, నాయకురాళ్ళు ఈశ్వరమ్మ, సుమలత, శోభ, కల్యాణి, రామేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద వనిత క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు ఆ క్లబ్ అధ్యక్షురాలు గీతరాణి తెలిపారు. మహిళలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వనిత క్లబ్ కోషాధికారి పద్మ, రాజేశ్వరి, స్వాతి, సువర్ణ, శోభరాణి, కవిత, జ్యోతి, హైమావతి, సౌజన్య, ఉమ, సంధ్య, ధరణి, సుమ, సౌమ్య పాల్గొన్నారు.

తోట ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలి

అచ్చంపేట: బల్మూర్ మండలం మైలారంలో గుండాల అనిల్, పాపయ్యలకు చెందిన బొప్పాయి పండ్లతోటలపై దాడి చేసిన దుండగుల వెంటనే శిక్షించాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం తోటను పరిశీలించిన ఆయన మాట్లాడారు. జరిగిన నష్టాన్ని నష్టం చేసిన వారి నుంచి ఇప్పించాలని కోరారు. దుండగులు తోట తగులబెట్టి, బోర్ వెల్ స్టార్టర్ విప్పి కరెంటు షాక్ పెట్టడంతో తోట మొత్తం ధ్వంసమైందన్నారు. ఈ సంఘటనపై ఫిర్యాదు చేసినా బల్మూర్ పోలీసులు ఇంత వరకు అరెస్టు చేయలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జక్క బాలయ్య, జిల్లా ఉపాధ్యక్షులు పి.బాలయ్య, వెంకటేశ్వర్లు, బాలింగం పాల్గొన్నారు.